


# నందివర్ధనం

...ధ నిలయం
3584
శ్రీకాకుళం

—: జయంపు కృష్ణ

భర్త చనిపోయాడన్న వార్త వినగానే-పదహారేళ్ళ వయసుకూడా దాటని తులసి 'కెవ్వు' మని కేక వేయలేదు. స్పృహ కోల్పోనూలేదు. మగ్గం మీద చీరను నేస్తూనేస్తూ ఓ క్షణంకాలం అలాగే ఆగిపోయింది.

ఆ క్షణంలో ఎంత జీవితం ధగ్గుమని మెరిసిందనీ??—

* * *

బంగారుపేటలో గురవయ్యకు ఒక్కగానొక్క గారాబు తనయ తులసి. అందంగా, చందనపు బొమ్మలా వుంటుంది. తాతముత్తాతల నుండీ చీరలు నెయ్యడంలో సిద్ధహస్తులనిపించుకున్న గురవయ్యకూడా అదే వృత్తిలోవున్నా, అతని చెయ్యిమాత్రం అందులో అందె వెయ్యలేదు. అయినా ఎలాగో పడుగుపేకలోనే బ్రతుకుతెరువు చూసుకుంటున్నాడు. తులసికి పదవ తరగతిలో జిల్లాలో ప్రథమ శ్రేణిలో వచ్చేటట్టు చదివించగలిగాడు. ఆ తరువాత ఆడపిల్లకు పెద్ద చదువులు ఎందుకన్న అమాయకుల మాటలు నమ్మి, ఆమె చదువును ఆపించాడు.

బంగారుపేటకు దగ్గరలోనే వెంకటగిరి వుంది. అక్కడ చీరలు నెయ్యడంలో గోవర్ధనం అనే యువకుడు చిన్నతనంలోనే మంచిపేరు తెచ్చుకున్నాడు. ఓమారు బంగారుపేటకు ఏదో పనిమీద వచ్చి, యాదృచ్ఛికంగా తులసిని చూసి, ఇష్టపడటంతో, అయత్నకృతంగా వారి పెళ్ళి జరిగిపోయింది.

అప్పటికే గోవర్ధనం పేరుప్రఖ్యాతులు విని, అతన్ని జీవిత భాగస్వామిగా ఊహించుకుని, కలలుకన్న తులసి ఆశయం కూడా నెరవేరింది. కానీ—

శోభనం రాత్రి తాగొచ్చిన భర్తను చూచి నివ్వెరపోయింది. తాగుడంటే చిన్ననాటినుండీ అసహ్యించుకునే తులసికి గోవర్ధనం హస్తనైపుణ్యం తెలుసుకానీ; అతనొక త్రాగుబోతనీ, పరమ తిరుగుబోతనీ తెలియదు-

తెలుసుకున్న క్షణం భయంకరం! నఖశిఖ పర్యంతం కంపించిపోయింది

తాగిన కళ్ళతో తనను చూడొద్దనీ, తాగిన మైకంలో తనను తాకొద్దనీ ప్రాధేయపడింది. తన సర్వస్వం అతని పాదాలముందు పెట్టి తనను స్వచ్ఛంగా స్వీకరించమని అభ్యర్థించింది.

ఫలితంగా— శోభన రాత్రి శోకభరితమయింది.

*　　　*　　　*

రోజూ తాగొచ్చి - తను కావాలని బాధించేవాడు, వేధించేవాడు. 'అందుకు'- ఆమె అంగీకరించేది కాదు.

మళ్ళీ చెప్పేది - మైకపు పొరల మాటున, మత్తు తెరల చాటున కాకుండా-మనస్ఫూర్తిగా ప్రేమించమని-దీనంగా, లాలనగా మళ్ళీ మళ్ళీ వేడుకునేది.

'మందులో పొందూ-ఆ మైకంలో మజా, ఆ ఇదే వేరు-' అనేవాడే కానీ, అర్థం చేసుకునేందుకు ప్రయత్నించేవాడే కాదు.

ఆ వాసనంటేనే ఆమెకు గిట్టేది కాదు; వాంతికొచ్చేది. వికారం పుట్టేది. ఇద్దరూ ఒకరినొకరు కోరి పెళ్ళాడినా మనసులు కలవలేదు; తనువులూ కలవలేదు. కాలం వారికోసం నిలవలేదు.

ఢిల్లీలో ఏర్పాటయిన ఒక ప్రదర్శనలో - చీరెల విభాగంలో గోవర్ధనం నేసిన వేంకటగిరి చీరకు జాతీయ గౌరవం లభించింది. అంతే కాదు—అతని అపూర్వ నైపుణ్యం విదేశీయుల దృష్టిని విపరీతంగా ఆకర్షించింది. అవన్నీ విని పొంగిపోయింది తులసి. అయినా అతని వ్యక్తిత్వాన్ని మన్నించలేక పోయింది. అతన్ని స్వీకరించలేక కృంగి పోసాగింది. ఎన్నో రకాలుగా ఆలోచించింది. ఎన్నో విధాలుగ తన్ను తాను సర్దుకోవాలని చూసింది. లాభం లేకపోయింది.

మనసును చంపుకోవడం ఆమెకు తెలియదు. ఆమె అప్పుడే వికసించిన పువ్వు.

గోవర్ధనం తల్లితండ్రులు మరీ ముసలివారు. బిడ్డ తెచ్చుకుంటున్న పేరు విని మురిసి పోతున్నారే కాని; అతను తొక్కుతున్న దారి మంచిది కాదని నివారించలేక పోతున్నారు. అప్పటికే పరిస్థితి చెయిదాటి పోయింది.

*　　　*　　　*

చివరికి ఓ రోజున— పొద్దుపోయి బాగా తాగొచ్చిన గోవర్ధనం తులసిని అనుమానించాడు; కసిగా అవమానించాడు.

తులసి.... పెళ్ళికాక ముందు ఎవరినో ప్రేమించి వుండిన కారణంగా.... ఇప్పుడు తనది కాలేకపోతున్నదని అభియోగం! తులసి అభిజాత్యం దెబ్బ తిన్నది.

ఆవేశంగా, రోషంగా తలెత్తిన కరుగ్గా, చురుగ్గా ఒక్కచూపు చూసింది. తన శీలాన్ని, వ్యక్తిత్వాన్నీ ప్రాణంగా భావించే స్త్రీ మాత్రమే ఆ చూపు చూడగలదు! నిజమే?

పాఠశాల్లో పెద్దతరగతి చదివేటప్పుడు పరిచయమైన సుధాకర్ ఎంతో తెలివైనవాడు! తనంటే పడిచచ్చేవాడు!!

ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించేవాడు!!! వచ్చీరాని వయసు! తెలిసి తెలియని ప్రేమ- అందమైన సాయంత్రాలు తను కోవెల ముందున్న కోనేరు దగ్గరకు నీళ్ళకెళితే- ఎవ్వరూ లేనప్పుడు చూసి, ఏ చెట్టుమాటునుంచో దగ్గరకొచ్చేవాడు, అప్పుడే పూసిన "నందివర్ధనం" చేతపట్టుకుని—

"నందివర్ధనాలు కోవెలలో చెట్టుకు పూస్తాయి. పచ్చని ఆకుల మధ్య ఎంత పవిత్రంగా కనిపిస్తాయనీ? ఒకటి కోసి గుడిలోని దేవత పాదాల ముందుంచాను, మరొకటినీ కోసం తెచ్చాను. ఈ పువ్వంటే నాకెంతో ఇష్టం, తీసికోవూ?" అంటూ అందించబోయేవాడు. బొద్దుగా ముద్దుగావున్న ఆ పువ్వును, కళ్ళెత్తి చూసేది తను—

అతని కళ్ళల్లో ఎంత ఆరాధన? ఎంత వెలుగు? ఎంత ప్రేమ? కోటి దీపాలు, శతకోటి భావాలు. మెరుపుగా తళుక్కు మనేవి తృటిలో—

చటుక్కున కళ్ళు దించుకుని, చరచరా వచ్చేసేది ఇంటికి! పాఠశాల, ప్రాంగణంలో తనకోసమే వెదుకుతూ వుండేవి అతని కళ్ళు—

తనూ అప్పుడప్పుడూ గమనించేది, నవ్వుకునేది. నేస్తాలు ఎక్కసం చేస్తే ఏవగించుకునేది. ఓనాడు—

పరీక్షలు కాగానే తనింటికి ధైర్యంగా వచ్చి, తన తండ్రివద్ద అతని గుండెల్లో దాచుకున్న కోరికను వెళ్ళడించాడా ప్రేమ పూజారి. ప్రశ్నార్థకంగా తనవంక చూశాడు తండ్రి అతన్ని పెళ్ళిచేసుకోవడం తన కిష్టంలేదని నిక్కచ్చిగా చెప్పేసింది తను.

అతని మోము ఎంత చిన్నబోయిందో? అతని మనసు ఎన్ని ముక్కలయిందో??- తను ఊహించుకోగలిగింది. అతను దీనంగా తన వంక చూసి, తలదించుకుని మౌనంగా వెళ్ళిపోయాడు. భారంగా అడుగులు వేసికొంటూ.

పరుగెత్తుకెళ్ళి, అతని చెయ్యి పట్టుకుని ఆపాలనిపించిందా క్షణం కానీ, పెళ్ళికాని ఆడపిల్ల మదిలో ఎవరు అత్యంతమైన ఎత్తులో పీఠం వేసుకు కూర్చుంటారో—వారికోసమే ఆ కన్య కలలు కంటుంది. వారినే భర్తగా ఎంచుకుని, జీవితాన్ని పంచుకోవాలని తపన పడుతుంది. తపస్సు చేస్తుంది. తనూ ఆ పనే చేసింది. గోవర్ధనాన్నే పెళ్ళాడింది. ఆ మాటే చెప్పింది తులసి.

తన జీవితాశయం గూర్చి మొర పెట్టుకుంది. అతనే తన జీవితమని కాళ్ళు పట్టుకుంది. అవేమీ వినిపించలేదు గోవర్ధనానికి: కాదు, వినిపించుకోలేదు. ఛీత్కారం చేశాడు, చీదపురుగువన్నాడు. తులసిని కొట్టాడు, మెడబట్టి నెట్టాడు, బలంగా.... బలవంతంగా....

తలవంటి గొప్ప కళాకారునకు తగని భార్య వన్నాడు. తన ఇంటి ఇల్లాలిగా అర్హత లేదన్నాడు- నానా మాటలు అని ఇక జీవితంలో ముఖం చూపించవద్దని ఉమ్మేసి, తలుపులు గట్టిగా వేసుకున్నాడు. తెల్లవార్లూ రోదిస్తూ ఆ తలుపుల దగ్గరే పడివుంది తులసి.

రాత్రంతా పీడకలలు కని, తెల్లవారే లోపల-కూతురింటి కొచ్చిన గురవయ్యకు ఆ దృశ్యం గుండెల్లో పొడిచినట్టయింది. కొండంత దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని, పుట్టెడు వ్యథతో తులసిని పుట్టింటికి తీసుకొచ్చాడు: అల్లుని దగ్గర తన ప్రార్థనా ఫలించక పోవడంతో.

*　　　*　　　*

చిన్ననాడే తల్లిని పోగొట్టుకున్న ఒక్కగానొక్క కూతురికింత అపకారం జరిగిందంటే, గురవయ్య కడుపు తరుక్కుపోతోంది. గుండె చెరువయిపోయింది. తండ్రి బాధను గమనించిన తులసి, ఎంతో ధైర్యం చెప్పింది ఓదార్చింది

అవ్యక్తమయిన భ్రమలో పెళ్ళి మానుకుని, నందివర్ధనం పువ్వుతో అప్పుడప్పుడూ ప్రత్యక్షమయ్యే సుధాకర్‌కి, అతినిర్లిప్తంగా సమాధానం చెప్పి నెమ్మదిగా సాగనంపుతోంది తులసి.

ఎక్కడో అతనిమీద రవ్వంత జాలి; కరుణ. కానీ, దానికి రూపంలేదు: భాష రాదు అనువదించుకునేందుకు అక్షరాలు చాలవు. తులసి క్రమంగా గంభీరతను, మౌనాన్ని అలవరచుకుంది.

ఏకాగ్రతతో నేత నేర్చుకోసాగింది, తండ్రి పర్యవేక్షణలో.

భర్త సన్నిధిలో గమనించిన మెళకువలు అవగాహనకు తెచ్చుకుని పట్టుదలతో అహరహం కృషిచేసి, అనతి కాలంతో వెంకటగిరి చీరలు నెయ్యడంలో అగ్రశ్రేణిలో నిలిచింది; కొత్త పోకడలను సంతరించుకుంది.

ఆ సంవత్సరం ఢిల్లీలో జరిగే ప్రదర్శనకు-తను ప్రత్యేకంగా నేసిన చీరలు పంపింది ఇంతలోనే భర్త మరణవార్త

*                    *                    *

గతాన్ని దర్శిస్తూ—అప్పటివరకూ మొగ్గలా ముగ్గంముందే కూర్చుండి పోయిన తులసీ, తేరుకుని, లేచి మౌనంగా తన పెట్టెను సర్దుకోసాగింది

కాటికి కాళ్ళు చాచిన వయసులో కన్నబిడ్డను పోగొట్టుకుని, కుమిలి పోతున్న అత్తమామలు ఆమె కళ్ళలో మెదిలారు! ఆలోచనా వీచికలలో ఊగిసలాడుతూ ఆమె బయలుదేరింది ఉన్నపళంగా.

మరింత వేదనతో కృంగిపోయిన ఆమె తండ్రి, చావు కబురు తెచ్చిన రాజయ్య ఆమెను అనుసరించారు. వెంకటగిరి బస్సెక్కారు.

ఇంతలో పరుగెత్తుకొచ్చిన సుధాకర్ ఆనందంగా చెప్పాడు, ఆ సంవత్సరం ఢిల్లీ ప్రదర్శనలో తులసి నేసిన చీరలకు జాతీయగౌరవం లభించిందని చెప్పి చేతిలోని నందివర్ధనాన్ని ఆమెకు ఆప్యాయంగా అందివ్వబోయాడు, అభినందిస్తూ.

ఒక్క ఘడియ ద్వైదీ భావంతో నిండిపోయిన ఆమె హృదయం - ఒక నిర్ణయానికి వచ్చి నిట్టూర్చింది. ఇంకా బస్సులోకి జనం ఎక్కుతూనేవున్నారు.

భారతదేశంలోని జనాభా అంతా ఒకే బస్సులోకి దూకినట్టు - ఒకటే రొద - తొక్కిసలాట-చెమటకంపు-

ఒకపక్కకు సర్దుకుని నిలుచుంది తులసి. కిటికీవైపుకు పరిగెత్తాడు సుధాకర్. "నందివర్ధనం అందంగానే వుంటుంది. కానీ, అది పూజకు నోచుకుంది. తీసుకెళ్ళి కోవెలలో దేవత పాదాల ముందుంచు. వస్తాను సుధాకర్!" అని చెప్పింది తులసీ, పైటచెంగును తలపైకి నిండుగాలాక్కొంటూ.

ఆమె అంతరంగం అర్థంకాని ఆ ప్రేమికుడు, అలాగే నడిరోడ్డుమీద ఆగిపోయాడు - చేతిలోని నందివర్ధనంతో! బస్సు వెళుతూనే వుంది

సుధాకర్ అలా చూస్తూనే వున్నాడు. అల్లంతదూరం వెళ్ళాక-బస్సు ఆగింది. అందులోంచి తులసి దిగింది. సుధాకర్‌వైపు రాసాగింది.

చైతన్యం వచ్చింది సుధాకర్‌లో. ఉత్కంఠతో అడుగులు ముందుకు వేశాడు. ఇద్దరూ కలుసుకున్నారు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయ్. తులసి కళ్ళల్లో ఏ భావమూ లేదు. ప్రశాంతంగా వుంది ఆమె చూపు! సుధాకర్ చేతిలోని "నందివర్ధనం" అందుకుంది తులసి.

బస్సువైపు తిరిగి నడిచింది - అనుసరించాడు సుధాకర్.

ఇద్దరూ బస్ ఎక్కారు, మళ్ళీ కదిలింది బస్ -

ఏ వేళ ఏ పువ్వు పూచేనో!